సాక్షి తిరుపతి

శుక్రవారం । 14 । మార్చి । 2025



భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే అని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన రీ సర్వేని పరిశీలించారు. - 8లో



స్వర్ణ నారావారిపల్లిలో భారీ స్కామ్

సీఎం స్వగ్రామంలో భారీ స్కామ్ చోటుచేసుకుంది. ఆక్రమిత భూమిలో అధికారులు సోలార్ అమర్చడం విమర్శలకు తావిస్తోంది. - 8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సా)	సహర్ శనివారం (ఉ)
తిరుపతి	6-26	5-01
గూడూరు	6-20	4-57

న్యూస్‌రీల్

బేస్ మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది



తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

సాక్షి, న్యూఢిల్లీ: తిరుపతి బస్టాండ్‌లో ఇంటర్–మోడల్ స్టేషన్(ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) కు బేస్ మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ గురుమూర్తి అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. బేస్ మాస్టర్ ప్లాన్ సిద్ధమైనందున ప్రాజెక్ట్ డిజైన్‌ను సంబంధిత వర్గాల సూచనలతో మెరుగుపరిచే పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రయాణికుల రవాణా సౌకర్యం, భద్రత, వేగవంతమైన రాకపోకలకు అనుగుణంగా మార్గదర్శకాలను ఖరారు చేస్తున్నారని చెప్పారు. డిజైన్ సిద్ధమైన వెంటనే పీపీపీ మోడల్ ద్వారా నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో కలసి ఈ ప్రాజెక్ట్ అమలు చేయనుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వివరించారు.

ఇంటర్ పరీక్షకు 901 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రథమ సంవత్సర విద్యార్థులకు కెమిస్ట్రి, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ సబ్జెక్టుల్లో పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు జనరల్‌లో 31,898 మంది, ఒకేషనల్‌లో 1,190మంది మొత్తం 33,088 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉంది. అయితే వీరిలో 901మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్‌ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ పరీక్షల్లో భాగంగా శనివారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు కెమిస్ట్రి, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ సబ్జెక్టుల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు ఆర్‌ఐఓ పేర్కొన్నారు

విద్యార్థులకు హాల్‌టికెట్ ప్రామాణికం

తిరుపతి అర్బన్: పదో తరగతి విద్యార్థులకు హాల్‌టికెట్ ప్రామాణికంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేయడానికి సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు జిల్లా ప్రజారవాణా అధికారి నరసింహులు తెలిపారు. ఈనెల 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు విద్యార్థి స్వస్థలం నుంచి లేదా వారి పాఠశాల నుంచి పరీక్ష కేంద్రం వరకు వెళ్లి రావడానికి కండక్టర్‌కు హాల్‌టికెట్ చూపిస్తే సరిపోతుందని ఆయన స్పష్టం చేశారు. అయితే పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ సర్వీసుల్లో మాత్రమే ఉచితంగా ప్రయాణం చేయవచ్చు, ఆ మేరకు జిల్లాలోని అన్ని డిపోల మేనేజర్లుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ఇదిలావుండగా తమిళనాడులోని తిరువణ్ణామలైకు గురు, శుక్రవారాలు పౌర్ణమి సందర్భంగా 142 సర్వీసులను జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.

ఆకలి పోరాటం

స్టైఫండ్ పెంచాలంటూ ఎస్వీ వెటర్నరీ జూడాలు చేస్తున్న సమ్మె 39వ రోజుకు చేరింది. గురువారం తిరుపతి బాలాజీ కాలనీలోని సర్కిల్‌లో భారీ ఎత్తున మానవహారం చేపట్టారు. నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల రాకపోకలను స్తంభింపజేశారు. తమకు న్యాయం చేసేవరకు ఈ పోరాటం ఆగదని తేల్చిచెప్పారు.

– తిరుపతి సిటీ



బాలజీ కాలనీ కూడలిలో వెటర్నరీ జూడాల మానవహారం

ఆధ్యాత్మిక సౌరభం

తిరుమల శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. చివరి రోజు అయిన గురువారం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్ప స్వామి తెప్పపై విహరిస్తూ కనువిందు చేశారు. భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించి పునీతులయ్యారు.

– తిరుమల



తెప్పపై విహరిస్తున్న మలయప్ప (ఇన్‌సెట్) హారతి ఇస్తున్న అర్చకులు

బిగుస్తున్న ఉచ్చు!

తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో జరిగిన ధమనకాండపై వైఎస్సార్‌సీపీ నేతలు న్యాయ పోరాటానికి దిగారు. దీనిపై తమిళనాడుకు చెందిన బీజేపీ మాజీ ఎంపీ, ప్రముఖ న్యాయవాది సుబ్రమణ్యస్వామి సైతం స్పందించారు. ఈ ఎన్నిక వ్యవహారంపై లోతైన విచారణ జరిపించాలని కోరుతూ హైకోర్టు తలుపుతట్టారు. అలాగే తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ఆధారాలతో సహా పార్లమెంట్‌లో గళ మెత్తారు. దీన్ని రాష్ట్ర హైకోర్టు సైతం తీవ్రంగా పరిగణించింది. ఈ మేరకు డీజీపీ, హోం శాఖ ముఖ్యకార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నోటీసులు జారీచేసింది. మానవ హక్కుల కమిషన్ సైతం విచారణకు ఆదేశించింది. నేడో రేపో పార్లమెంట్ కార్యాలయం సైతం స్పందించనుంది. ఇలా అన్ని రకాలుగా పోలీసులు, అధికారులు నాడు దౌర్జన్యకాండకు దిగిన టీడీపీ, జనసేన నేతలకు ఉచ్చు బిగియనుంది.

- ముదురుతున్న డిప్యూటీ మేయర్ ఎన్నిక వ్యవహారం
- ఘర్షణలు, దాడులు, కిడ్నాప్‌లు, ఆస్తుల ధ్వంసంపై న్యాయపోరాటం
- దుశ్చర్యపై పార్లమెంట్ వేదికగా గళమెత్తిన ఎంపీ గురుమూర్తి
- మానవ హక్కుల ఉల్లంఘనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ కన్నెర
- సీబీఐ దర్యాప్తును కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన సుబ్రమణ్యస్వామి
- రాష్ట్ర డీజీపీ, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, ఎన్నికల కమిషన్‌కు నోటీసులు
- అలసత్వం వహించిన అధికారుల గుండెల్లో రైళ్లు
- కేసులు తప్పవని భయపడుతున్న జనసేన, టీడీపీ వర్గాలు



కార్పొరేటర్ల బస్సు అద్దాలు ధ్వంసం చేస్తున్న కూటమి మూకలు (ఫైల్)

తిరుపతి తుడా: తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికను గతనెల 3వ తేదీన నిర్వహించారు. తిరుపతి కార్పొరేషన్ 50 డివిజన్‌లు ఉండగా, గతంలో 49 డివిజన్లకు ఎన్నికలు నిర్వహించారు. ఇందులో టీడీపీ నుంచి ఒక్కరు మాత్రమే గెలుపొందారు. 4వ డివిజన్ కార్పొరేట్‌గా ఉన్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి గత సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆ పదవికి రాజీనామా చేశారు. అనారోగ్యంతో 24వ డివిజన్ కార్పొరేటర్ మృతి చెందారు. ఇలా మొత్తం 47 మంది కార్పొరేటర్లలో 46 మంది వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలుపొందినవారే ఉన్నారు. డెప్యూటీ మేయర్ ఎన్నికలను సజావుగా నిర్వహించి ఉంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డిప్యూటీ మేయర్‌గా విజయం సాధించి ఉండేవారు.

బలం లేకపోయినా బరితెగింపు

కూటమి నేతలు తమకున్న 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణను డెప్యూటీ మేయర్ ఎన్నికల్లో బరిలోకి దింపారు. ఈ క్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సైతం తిరుపతిలో తిష్ట వేసి ఉన్నతాధికారులను సైతం పిలిపించుకుని గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని హుకుం జారీ చేసినట్లు ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. కొంతమంది వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేసి తమ వైపునకు తిప్పుకున్నారు. అప్పటికీ కూటమి అభ్యర్థికి 11 మంది మాత్రమే బలం ఉంది. దీంతో రంగప్రవేశం చేసిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల ఆస్తులపై దండయాత్ర ప్రారంభించారు. మరో కార్పొరేటర్‌కు చెందిన వ్యాపారాలను సీజ్ చేస్తామంటూ హెచ్చరికలు జారీచేశారు. దానికితోడు ఐదుగురు కార్పొరేటర్లను ఎన్నికలు జరిగే వేదిక సమీపంలోనే కిడ్నాప్ చేశారు. కార్పొరేటర్ల ఇళ్లకు వెళ్లి భయభ్రాంతులకు గురిచేశారు. కార్పొరేటర్లు బస చేస్తున్న హోటల్‌పై అర్ధరాత్రి వేళ అరాచకం సృష్టించారు. ఎన్నిక రోజు పోలింగ్‌కు వచ్చిన కార్పొరేటర్ల వాహనంపై దాడికి తెగబడ్డారు. వాహనాన్ని ధ్వంసం చేసి బస్సులోని కార్పొరేటర్లను కొట్టుకుంటూ టీడీపీ, జనసేన నేతల తమ సొంత వాహనాల్లో కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. కార్పొరేటర్లను పోలింగ్‌కు రాకుండా ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారు. ఈ వ్యవహారానికి సంబంధించి సీసీ పుటేజీలు, పేపర్ క్లిపింగ్‌లు, నాడు దాడి జరిగిన విజువల్స్ ఆధారంగా వైఎస్సార్‌సీపీ న్యాయ పోరాటానికి దిగింది.

మానవ హక్కుల కమిషన్ కన్నెర్ర

ఎక్స్ అఫిషియో సభ్యుని హోదాలో డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి కార్పొరేటర్లతో కలసి ఎస్వీయూ సెనేట్ హాల్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో టీడీపీ, జనసేన మూకలు ఎంపీపై దురుసుగా ప్రవర్తించాయి. దీంతో ఆయన జాతీయ మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఆధారాలతో సహా కమిషన్ ముందు ఉంచారు. ఇందుకు కారకులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సీసీ పుటేజీలు, వీడియో క్లిప్పింగ్‌లు, పేపర్ కటింగ్‌లను సైతం మానవహక్కుల కమిషన్‌కు అందజేశారు. ఈ వ్యవహారంపై మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది. త్వరలో విచారణ బృందం ఈ వ్యవహారంపై విచారించనుంది.

నాటి అల్లర్లపై స్పందించిన హైకోర్టు

డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో చోటు చేసుకున్న వ్యవహారం పై బీజేపీ మాజీ ఎంపీ, ప్రముఖ న్యాయవాది సుబ్రమణ్యస్వామి హైకోర్టును ఆశ్రయించారు. సీబీఐ దర్యాప్తు చేపట్టి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ ఎన్నికల్లో చోటుచేసుకున్న పరిణామాలపై స్టేటస్ రిపోర్టును సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలను కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర డీజీపీ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశిస్తూ నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. ఈ కేసు వ్యవహారం ముదురుతుండడంతో పోలీసు అధికారులు, ఆస్తుల కూల్చివేతకు దిగిన టౌన్ ప్లాన్ అధికారుల్లో ఆందోళ నెలకొంది. రాజకీయ కుట్రకు తాము బలికాకతప్పదన భయం పట్టుకుంది.

టీడీపీ, జనసేన నేతల్లో టెన్షన్

అల్లర్లు, దాడులు, కిడ్నాప్ వ్యవహారాలపై ఆధారలతో సహా ఫిర్యాదు చేయడంతో ఓ పక్క మానవ హక్కుల కమిషన్, మరో పక్క రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థానం తీవ్రంగా స్పందించాయి. సమగ్ర నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులకు నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో సీసీ పుటేజీలు, వీడియో టేపులు, ఫొటోల ఆధారంగా కేసులు నమోదయ్యే అవకాశం ఉంది. దాడులు, కిడ్నాప్ వ్యవహారం పూర్తిగా విజువల్స్‌లో ఉండడంతో టీడీపీ, జనసేన నేతలలో టెన్షన్ మొదలైంది. కేసుల వ్యవహారం తమ మెడకు చుట్టుకుంటుంది ఆందోళన చెందుతున్నారు.



మేయర్ శిరీషాను అడ్డుకుంటున్న పోలీసులు(ఫైల్)



ఎంపీ గురుమూర్తి వాహనాన్ని చుట్టుముట్టిన మూకలు

ఏప్రిల్ 30న పాలిసెట్ ప్రవేశ పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి విద్యార్హతతో పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 30వ తేదీన పాలిసెట్–2025 ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఆ మేరకు తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్, జిల్లా కో–ఆర్డినేటర్ ఆర్‌వీ.రమణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాకు సంబంధించి తిరుపతి, సత్యవేడు, గూడూరులో ఏర్పాటుచేయనున్న పరీక్షా కేంద్రాల్లో పాలిసెట్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు పదో తరగతి పాసైన విద్యార్థులు, ప్రస్తుతం పది పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. పాలిసెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఉచితంగా శిక్షణతో పాటు మెటీరియల్‌ను అందించనున్నట్లు తెలిపారు. పాలిసెట్ ప్రవేశ పరీక్షకు 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీ పీఎల్‌వైసీఈటీ.ఏపీ.ఎస్‌బీసీ.ఇన్' వెబ్‌సైట్ ద్వారా ఏప్రిల్ 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100, బీసీ, ఓసీ విద్యార్థులు రూ.400పరీక్ష ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోదలచిన విద్యార్థులు సమీపంలోని ఏదేని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించవచ్చని, అలాగే తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ సెంటర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. వివరాలకు 99851 29995 నంబరులో హెల్ప్‌లైన్ సెంటర్ ఇంచార్జ్ కమల్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 8 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 68,509 మంది స్వామివారిని దర్శించుకోగా 23,509 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.86 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.



యథేచ్ఛగా మట్టి దోపిడీ

వరదయ్యపాళెం మండలంలో మట్టి దోపిడీ మొదలైంది. బత్తలవల్లం పంచాయతీ చెదులుపాకం చెరువు నుంచి గ్రావెల్ తరలిపోతోంది. టీడీపీ నేతల సహకారంతో దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. రెండు రోజులుగా వందలాది టిప్పర్‌లతో రూ.లక్షల విలువైన మట్టి తమిళనాడుకు వెళ్లిపోతోంది. అడ్డుపడిన గ్రామస్తులపై పచ్చనేతలతో కలిసి అక్రమార్కుల దౌర్జన్యం పెరిగిపోతోంది. ఈ క్రమంలోనే అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతోంది. గ్రావెల్ మాఫి యాకు నిస్సిగ్గుగా అండగా నిలుస్తోంది.

- చెదులుపాకం చెరువులో మొదలైన గ్రావెల్ తవ్వకాలు
- తమిళనాడుకు తరలిస్తున్న అక్రమార్కులు
- దందాకు సహకరిస్తున్న టీడీపీ నేతలు
- కన్నెత్తి చూడని రెవెన్యూ, పోలీసు అధికారులు



చెదులుపాకం వద్ద భారీ యంత్రాలతో మట్టిని తవ్వి లారీలకు లోడ్ చేస్తున్న టిప్పర్

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాళెం మండలంలోని చెదులుపాకం వద్ద చెరువులో ఇష్టారాజ్యంగా భారీ యంత్రాలతో మట్టిని తవ్వేస్తున్నారు. నియంత్రించాల్సిన రెవెన్యూ, పోలీస్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. స్థానికులు అడ్డుపడుతున్నా అధికారుల సహకారం లేకపోవడంతో ప్రయోజనం లేకుండా పోతోంది. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారితో ఒప్పందం కుదుర్చుకున్న అధికారులు మాత్రం తమకేమీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అంతేకాక అక్రమంగా అనుమతులను ఇస్తూ మాఫియాకు మద్దతు పలకడం విమర్శలకు దారి తీస్తోంది. గ్రామస్తుల విన్నపాలను పట్టించుకోని అధికారులు గ్రావెల్ మాఫియాను ప్రోత్సహించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇంతజరుగుతున్నా మైనింగ్ అధికారులు పత్తా లేకుండా పోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం వ్యవహారానికి టీడీపీ స్థానిక నేతలే కారణమని ఆరోపిస్తున్నారు. తమ జేబులు నింపుకునేందుకు చెరువును ధ్వంసం చేస్తున్నారని మండిపడుతున్నారు.

కాలనీకి ముప్పు

చెదులుపాకం వద్ద ఇల్లు లేని నిరుపేదల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. పేదలకు పట్టాలు పంపిణీ చేయగా కొంతమంది ఇళ్లు కూడా నిర్మించుకున్నారు. అయితే ప్రస్తుతం జగనన్న కాలనీకి సమీపంలోని చెదులుపాకం చెరువులో భారీగా తవ్వకాలు చేపడుతున్న కారణంగా వర్షాకాలంలో తమ నివాసాలకు ముప్పు తప్పదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాక జగనన్న కాలనీ మీదుగా వందలాది వాహనాలు గ్రావెల్ లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో దారులు సైతం ధ్వంసమవుతున్నట్లు వాపోతున్నారు.



మట్టి కోసం వేచి ఉన్న టిప్పర్లు

తెర వెనుక తమ్ముళ్లు

చెదులుపాకం చెరువు వద్ద సాగుతున్న గ్రావెల్ దందా వెనుక మండలానికి చెందిన ఓ వర్గం టీడీపీ కీలక నేతలు ఉన్నట్లు గ్రామస్తులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. వీరి అండదండలతోనే తమిళనాడుకు మట్టి అక్రమ రవాణా జరుగుతోందని స్పష్టం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల పేరిట అక్రమంగా అనుమతులు తీసుకుని గ్రావెల్ దోపిడీకి శ్రీకారం చుట్టారని విమర్శిస్తున్నారు.

మొల్లమాంబకు ఘన నివాళి



మొల్లమాంబ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : వాల్మీకి మహర్షి రాసిన సంస్కృత భాషల నుంచి తెలుగులోకి అత్యంత రమణీయంగా రాసిన మొట్టమొదటి మహిళా కవయిత్రి మొల్లమాంబ అని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. ఈ మేరకు తిరుపతి పద్మావతిపురంలోని ఆయన నివాసం వద్ద గురువారం కవయిత్రి మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పుష్పాలతో నివాళి అర్పించారు. ఎంపీపీ యశోదమ్మ, సర్పంచ్ చిన్నియాదవ్, ఎంపీటీసీలు జైకర్, నాగభూషణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు రుద్రగోపి, వాసు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఘనంగా మొల్ల జయంతి



కవయిత్రి మొల్ల జయంతిలో డీఆర్వో తోపాటు పలువురు అధికారులు

తిరుపతి అర్బన్: కవయిత్రి మొల్ల రచనా శైలి ఎంతో సరళమైందని, రమణీయమైనదని డీఆర్వో నరసింహులు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆమె జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణాన్ని సంస్కృతం నుంచి సామాన్యులకు అర్థమయ్యే విధంగా తెలుగు భాషలోకి అనువదించిన కవయిత్రి మొల్ల అని కొనియాడారు. కడప జిల్లా, గోపవరం గ్రామంలో కుమ్మరి కుటుంబంలో జన్మించిన మొల్ల 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రిగా ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి జ్యోత్స్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య పాల్గొన్నారు.

యువత పోరు విజయవంతం

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన యువత పోరు విజయవంతం అయిందని, ఇందులో పాల్గొన్న విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, పార్టీ శ్రేణులకు చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యువతపోరులో పాల్గొని కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై విద్యార్థులు, యువత ఉద్యమించిందన్నారు.

ఇన్‌చార్జి సీవీఎస్‌ఓ బాధ్యతల స్వీకరణ



టీటీడీ ఇన్‌చార్జ్ సీవీఎస్‌ఓకు శ్రీవారి లడ్డూ ప్రసాదాలు

తిరుమల: టీటీడీ ఇన్‌చార్జ్ సీవీఎస్‌ఓగా మంగళవారం ఎస్పీ హర్షవర్ధన్ రాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనను టీటీడీ ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం లడ్డూ ప్రసాదాలతో సత్కరించి, వేద ఆశీర్వచనాలు అందించారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా వెంకటరమణ

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన టి.వెంకటరమణను చిత్తూరు, తిరుపతి జిల్లాల పార్టీ ఆర్గనైజేషన్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది.

టర్మ్ ఫీజుతో ముడిపెట్టడం దారుణం



వైస్ ప్రిన్సిపల్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఏఐఎస్‌ఏ నాయకులు

తిరుపతి సిటీ: ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో అల్లాడిపోతున్న విద్యార్థులకు వర్సిటీ అధికారులు తలనొప్పిగా మారారని ఏఐఎస్‌ఏ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంజిత్ కుమార్, చిన్న ఆవే భీన వ్యక్తం చేశారు. పీజీ విద్యార్థులు టర్మ్ ఫీజు చెల్లించనిదే సెమిస్టర్ పరీక్ష ఫీజులకు అనుమతి ఇవ్వకపోడం దారుణమన్నారు. ఈ మేరకు వర్సిటీ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ భాస్కర్‌రెడ్డికి గురువారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పూర్తిగా విడుదల కావడంలేదని, కానీ వర్సిటీ అధికారులు పీజీ విద్యార్థులకు టర్మ్ ఫీజు చెల్లించిన తర్వాతనే సెమిష్టర్ ఫీజు కట్టించుకుంటామంటూ నరకం చూపిస్తున్నారని మండిపడ్డారు. తక్షణం అధికారులు సెమిస్టర్ పరీక్షఫీజులు కట్టించుకోవాలని, లేని పక్షంలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఏఐఎస్‌ఏ నాయకులు రాజు, వేణు, కృష్ణవంశీ, వంశీ పాల్గొన్నారు.

హిటాచీ సీజ్



తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్‌లో హిటాచీ

తిరుపతి రూరల్: స్వర్ణముఖి నదిలో అక్రమంగా ఇసుకను తోడేస్తున్న హిటాచీను తిరుపతి రూరల్ పోలీసులు సీజ్ చేశారు. గురువారం తిరుపతి రూరల్ మండలం, చిగురువాడ సమీపంలోని స్వర్ణముఖి నదిలో కొంత మంది అక్రమార్కులు ఇసుకను అక్రమంగా తోడేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీనిపై స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హిటాచీని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

పారదర్శకంగా పది పరీక్షలు

- జిల్లాలో 164 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 28,656 మంది విద్యార్థులు
- డీఈవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- 'సాక్షి'తో డీఈవో కేవీఎన్ కుమార్



కేవీఎన్ కుమార్, డీఈవో

తిరుపతి అర్బన్: 'పది పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశాం. ప్రధానంగా మాస్‌కాఫీయింగ్‌కు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాం'అని జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం 'సాక్షి'తో మాట్లాడారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. 'పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా అన్ని వసతులు కల్పిస్తాం. జిల్లా వ్యాప్తంగా 164 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇందులో 28,656 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పదో తరగతి పరీక్షలు ఈ నెల 17 నుంచి 31 వరకు జరగనున్నాయి. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 15,455 మంది, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 11,548 మంది, 634 మంది ప్రైవేటు విద్యార్థులు, 1,019 మంది ఓపెన్ స్కూల్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరికి ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష ఉంటుంది. 1,904 మందికి డ్యూటీలు ఇచ్చాం. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూతవేయాలి. డ్యూటీలో ఉన్న ప్రతి ఉద్యోగి ఐడీ కార్డులతోనే విధులకు హాజరుకావాలి. 1,476 మంది ఇన్విజిలేటర్లుతోపాటు రెవెన్యూ, పోలీస్, విద్యాశాఖకు చెందిన ముగ్గురు అధికారులతో కూడిన 6 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఉంటాయి. అంతేకాకుండా 30 సిట్టింగ్ స్క్వాడ్స్, 164 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 163 మంది డిపార్ట్‌మెంట్స్ ఆఫీసర్లు, 41 మంది కస్టోడియన్లు, 11 మంది రూట్ ఆఫీసర్లు, ఆరుగురు అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లు డ్యూటీల్లో ఉంటారు. జిల్లాలోని 39 పోలీస్ స్టేషన్లలో ప్రశ్నపత్రాలు ఉన్నాయి. వచ్చే శనివారం మరోసారి సిబ్బందితో సమావేశం నిర్వహించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తాం. ఏమైనా ఫిర్యాదులు వస్తే స్వీకరించడానికి 7569787131 కంట్రోల్ రూమ్‌ను డీఈఓ కార్యాలంలో ఏర్పాటు చేశాం.' అని చెప్పారు

అన్‌డాకింగ్ ప్రక్రియ విజయవంతం

సూళ్లూరుపేట: డాకింగ్ టెక్నాలజీని సముపార్జన కోసం ఇస్రో చేసిన అన్ని పరీక్షలను విజయవంతం చేశారు. గురువారం 9.20 గంటలకు స్పేడెక్స్ ఉపగ్రహాలను విడదీసే అన్‌డాకింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. డిసెంబర్ 30న పీఎస్ఎల్‌వీ సీ60 రాకెట్ ద్వారా స్పేడెక్స్ ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించారు. జనవరి 16న సేడెక్స్‌లోని ఛేజర్, టార్గెట్ ఉపగ్రహాలను మాస్టర్ కంట్రోల్ సెంటర్ శాస్త్రవేత్తలు తమ అదుపులోకి తీసుకుని నియంత్రిస్తూ ఒకదానితో ఒకటి అనుసంధానం చేశారు. గురువారం 9.20 గంటలకు డాకింగ్‌లో ఉన్న రెండు ఉపగ్రహాలను విడదీసి అన్ డాకింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. ఈ ప్రక్రియ ఇస్రోకి ఒక చరిత్రాత్మక క్షణంగా, అలాగే డాకింగ్ టెక్నాలజీని అందుకోవడం కూడా ఇస్రో చరిత్రలో ఒక మైలు రాయిగా ఇస్రో శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. డాకింగ్ టెక్నాలజీని సముపార్జించుకోవడం ప్రపంచంలో నాలుగవ దేశంగా భారత్ పేరు ప్రఖ్యాతులు పొందిన విషయం తెలిసిందే.



బెంగళూరులోని మాస్టర్ కంట్రోల్ సెంటర్‌లో స్పేడెక్స్ ఉపగ్రహాలతో అన్‌డాకింగ్ చేస్తున్న దృశ్యం

'ఓపెన్'గానే పరీక్షలు



పాఠశాల సమీపంలో పడి ఉన్న స్లిప్పులు

వెంకటగిరి రూరల్ : దూర ప్రాంతాల్లో ఉంటూ ఉన్నత విద్యను అభ్యసించేందుకు నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలు మాస్ కాపీయింగ్‌కు దారితీస్తున్నాయి. ఓపెన్ ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు వెంకటగిరిలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి సిట్టింగ్ స్క్వాడ్ -2, ఇన్విజిలేటర్లు -10 మంది, చీఫ్-1, డిపార్టమెంట్ అధికారి-1 మొత్తం 12 మందిని ఏర్పాటు చేశారు. విద్యార్థులను పాస్ చేయడమే లక్ష్యంగా కొన్ని కళాశాలల నిర్వాహకులు మాస్‌కాపింగ్‌ను ప్రోత్సహిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా జిల్లా ఉన్నతాధికారులకు భారీగా ముడుపులు సమర్పించినట్టు సమాచారం.

శభాష్ సౌజన్య



అవార్డు అందుకుంటున్న సౌజన్య శ్రీధర్(ఫైల్)

సూళ్లూరుపేట: పైసా పెట్టుబడి లేకుండా ఎంతో మంది మహిళలకు ఉపాధి కల్పించింది. నెలకు రూ.లక్ష దాకా సంపాదించుకునే విధంగా తయారు చేసింది... తడకు చెందిన సౌజన్య శ్రీధర్ అనే మహిళ. వేస్టేజ్ డైరెక్ట్ సెల్లింగ్ నెట్‌వర్క్ మార్కెటింగ్‌లో చేరి తనతోటి మహిళలకు కూడా ఇందులో భాగస్వామ్యం కల్పించింది. ఈనెట్‌వర్క్ మార్కెటింగ్‌ను ఏపీలోనే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు కూడా విస్తరించింది. ఆమె ప్రతిభను కేంద్ర ప్రభుత్వం గుర్తించి ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్-2025 అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు ఢిల్లీలోని కేడీ జాదవ్ ఇండోర్ హాలులో సౌజన్య శ్రీధర్‌కు అవార్డు అందజేసింది.

తాకట్టు నగలు చోరీ కేసులో అసిస్టెంట్ మేనేజర్ అరెస్ట్



అసిస్టెంట్ మేనేజర్ ఏ.సూర్యతేజను అరెస్టు చూపుతున్న పోలీసులు

సత్యవేడు: నాగలాపురం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్‌లో ఖాతాదారులు తాకట్టు పెట్టిన నగల చోరీ కేసులో ఆ బ్యాంకు అసిస్టెంట్‌మేనేజర్ ఏ.సూర్యతేజను అరెస్టు చేసినట్టు సీఐ మురళి తెలిపారు. ఈ మేరకు గురువారం నిందితుడిని అరెస్ట్ చూపారు. తిరుపతి రీజినల్ మేనేజర్ వీ.బ్రహ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు పై నాగలాపురం పోలీస్ స్టేషన్‌లో గత నెల ఫిబ్రవరి 21న కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా మార్చి 12వ తేదీన నాగలాపురం ఈస్టు చర్చి వద్ద ముద్దాయిని అరెస్టు చేసి బంగారు నగలు తాకట్టు పెట్టిన రసీదులు స్వాధీనం చేసుకున్నారు.

జరిగింది ఇలా..

బ్యాంకు మేనేజర్ తిర్రైవరాజ్ ,అసిస్టెంట్ మేనేజర్ ఏ.సూర్యతేజ బంగారు నగల లాకర్‌కు కస్టోడియన్లుగా ఉన్నారు. నగలు ఉన్న లాకర్ ఓపెన్ చేసి క్లోజ్ చేసేటప్పుడు ఇద్దరూ ఉండాల్సి ఉంది. బ్యాంకు మేనేజరు నిర్లక్ష్యం కారణంగా దానిని ఆసరగా తీసుకొన్న అసిస్టెంట్‌మేనేజర్ 30 మంది బంగారు నగలు (2,634 గ్రాములు) దొంగతనంగా బ్యాంకు నుంచి తీసుకొని ఇతర బ్యాంకులు, వివిధ ప్రయివేటు ఫైనాన్స్ సంస్థల నుంచి తనపేరున రుణం, మరో 11 పేర్లతో 37 సార్లు బంగారు నగలు మార్చి తాకట్టుపెట్టి రూ.1.3 కోట్ల రుణం పొందాడు. ఆ డబ్బును ఆన్‌లైన్ జూదమాడి పోగొట్టుకున్నాడు. ఫిబ్రవరి 10న జోనల్ ఆడిట్‌అధికారి రాజ్‌కమల్ నాయక్ తనిఖీ చేపట్టారు. ఆడిట్ చేపట్టిన సమయంలో లాకర్ పరిశీలిచగా 11 మంది పేరిట ఉండాల్సిన ఆభరణాలు లేకపోవడంతో.. అసిస్టెంట్ మేనేజర్‌ను ఫోన్‌లో సంప్రదించగా నేరాలు ఒప్పుకోవడంతో ఆడిట్ అధికారి అవాక్కయ్యారు. బ్యాంకు మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లను ఫిబ్రవరి 11న సస్పెండ్‌చేశారు. వారి స్థానంలో కొత్తగా మేనేజర్‌గా నాగమునేంద్ర, అసిస్టెంట్ మేనేజర్‌గా విజయ్‌శేఖర్ నియమించారు. రెండో ముద్దాయిగా ఉన్న మేనేజర్ తిర్రైవరాజ్‌ను త్వరలో అరెస్టు చేస్తామన్నారు సీఐ తెలిపారు.

స్వర్ణ నారావారిపల్లి క్లస్టర్లో భారీ స్కామ్

- అక్రమ నిర్మాణాల్లో ఉచిత సోలార్‌ను అమర్చిన అధికారులు
- నివాసం ఉన్న ఇళ్లకు కాకుండా అక్రమ నిర్మాణం చేపట్టిన షెడ్డుకు సోలార్ ఏర్పాటు



ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన షెడ్డుకు ఉచిత సోలార్ కనెక్షన్ అమర్చిన విద్యుత్ శాఖ అధికారులు



ప్రభుత్వ భూమిలో ఎలాంటి విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వకూడదంటూ విద్యుత్ శాఖకు లేఖ రాసిన రెవెన్యూ అధికారులు(ఫైల్)

చంద్రగిరి: 'సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. ఇందుకోసం నా స్వగ్రామం నారావారిపల్లిని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుంటున్నా. స్వర్ణ నారావారిపల్లి క్లస్టర్ పేరుతో ఏ.రంగంపేట నుంచి మూలపల్లి వరకు ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్‌ను వినియోగించేలా ఉచితంగా కనెక్షన్‌లను అందజేసి, ప్రజల్లో వాటి వినియోగం పెంచేలా అవగాహ కల్పించడమే ఉద్దేశం' అంటూ సీఎం చంద్రబాబు చెప్పిన మాటలకు అధికారులు ఉప్పొంగిపోయారు. అర్హులైన లబ్ధిదారులకు స్వర్ణ నారావారిపల్లి క్లస్టర్ ప్రాజెక్టు కింద విద్యుత్ సోలార్‌ను అమర్చాల్సి ఉంది. అయితే అధికారులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలోని ఏ.రంగంపేట సమీపంలోని నాగపట్ల లెక్కదాఖల సర్వే నం.80/ఏలో 8.31 సెంట్ల ప్రభుత్వ తోపు పోరంబోకు భూమి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏ.రంగంపేటకు చెందిన ఓ వ్యక్తి సుమారు రూ.50లక్షల విలువైన 100 అంకణాల భూమిని దర్జాగా అక్రమించేశాడు. అపై అక్రమంగా షెడ్డును నిర్మించి, బౌండరీని ఏర్పాటు చేసుకున్నాడు. దీనిపై గతంలోనే పలు ఫిర్యాదు వెళ్లాయి. అది పూర్తిగా ప్రభుత్వ భూమి అని, ఎవరికీ పట్టాలు మంజూరు చేయలేదని, అక్రమ నిర్మాణాలకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వకూడదంటూ రెవెన్యూ అధికారులు సైతం విద్యుత్ శాఖ అధికారులకు సర్క్యులేషన్‌ను అందించారు. అవన్నీ పక్కనబెట్టిన విద్యుత్ అధికారులు అక్రమ షెడ్డుకు విద్యుత్ కనెక్షన్‌ను మంజూరు చేశారు.అధికార పార్టీకు చెందిన ఓ వ్యక్తి ఓ ప్రజాప్రతినిధికి మీడియా పీఏ అంటూ చెప్పుకుని అక్రమంగా నిర్మించిన షెడ్డులో ఎవరూ నివాసం లేకపోయినా ఉచిత సోలార్ సిస్టమ్‌ను అమర్చుకోవడం ఇప్పుడు మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

చిరుధాన్యాలతో అధిక లాభాలు



వంట పాత్రల కిట్‌తో మహిళా రైతులు

తిరుపతి సిటీ: చిరుధాన్యాలతో అధిక లాభాలు పొందవచ్చని ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్ర వేత్త డాక్టర్ కరీముల్లా పేర్కొన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో అఖిల భారత జొన్న, చిరుధాన్యాల సమన్వయ పరిశోధనా పథకం ఆధ్వర్యంలో గురువారం షెడ్యూల్డ్ కులాల మహిళా రైతులకు చిరుధాన్యాలతో తయారు చేసే పలు రకాల పదార్థాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మహిళలకు అవగాహన కల్పించారు. ఆహారపు అలవాట్లు సైతం మారకతప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం వంట పాత్రలను, చిరుధాన్యాల ద్వారా ఆహార పదార్థాలను తయారు చేసే కిట్‌ను మహిళకు అందజేశారు. ఏడీఆర్ డాక్టర్ సుమతి, డాక్టర్ కదిరిమోహన్ హాజరయ్యారు

క్రియేటివిటీ, నైపుణ్యాలతో ఇంజినీర్లకు గుర్తింపు



అకడమిక్ టాపర్‌కు ట్యాబ్‌ను అందిస్తున్న సుదర్శనరావు, అశోకరాజు



పాటలతో అలరిస్తున్న సంయుక్త మీనన్, భానుశ్రీ

- జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు

నారాయణవనం: క్రియేటివిటీ, నైపుణ్యాలతోనే యువ ఇంజినీర్లకు గుర్తింపు లభిస్తుందని అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ సుదర్శనరావు పేర్కొన్నారు. పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలల 24వ జూబిలేషన్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పాల్గొన్నారు. ఓపెన్ ఆడిటోరియంలో గురువారం సాయంత్రం జరిగిన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం కాకుండా కోడింగ్, డీ-కోడింగ్, ప్రాబ్లమ్ సొల్యూషన్ల మీద పనిచేయలని, పారిశ్రామిక వేత్తలుగా ఎదనాలని పిలుపునిచ్చారు. సెమీ కండక్టర్ టెక్నాలజీ, నిర్మాణ, విద్యుత్ రంగాల్లో స్టార్టప్ ప్రాజెక్ట్‌లపై దృష్టి సారించాలని చెప్పారు. కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, యోగా, ధ్యానంపై దృష్టి పెట్టి మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. అకడమిక్ టాపర్లకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. దక్షిణాది సినీ నటి సంయుక్తా మీనన్ ఆటల పాటలతో అలరించారు. యాంకర్ భానుశ్రీ తన మాట తీరుతో ఆకట్టుకున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉర్రూతలూగించాయి.

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే


- బోనుపల్లి రీసర్వే ప్రక్రియలో దొర్లిన తప్పలను సరిదిద్దుతాం
- క్షేత్ర స్థాయిలో పర్యటించిన కలెక్టర్ వెంకటేశ్వర్



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి: రైతుల భూ సమస్యల పరిష్కార దిశగా రీసర్వే ప్రక్రియ చేపట్టామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం ఆయన తొట్టంబేడు మండలం బోనుపల్లిలో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, స్థానిక రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. రీసర్వేపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత నెలలో రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని, అందులో ముఖ్యమంత్రి, అలాగే మంత్రులు, శాసనసభ్యులు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువగా భూసమస్యలపైనే వచ్చాయని చెప్పారు. ఇదివరకు జరిగిన భూసర్వేలో జరిగిన తప్పుల వల్ల గందరగోళ పరిస్థితి ఏర్పడిందని, ఆ తప్పులను సరి చేసి పక్కాగా రీసర్వే చేస్తామన్నారు. రీసర్వే, రెవెన్యూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు క్షేత్ర స్థాయిలో రైతుల సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తున్నారో తెలుసుకోవడానికే గ్రామానికి వచ్చినట్లు తెలిపారు. ఈ గ్రామంలో రీసర్వే వల్ల జాయింట్ ఖాతాలు, వన్‌బీ సమస్యలు, భాగపరిష్కారం, సాదాబైనామీ అయి సాగులో ఉన్న వారికి పట్టాలు లేకపోవడం వంటి సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. కాళంగి నది వల్ల పంట పొలాలు మునిగిపోవడం జరిగిందని రైతులు తెలుపగా.. రోజూవారీ ప్రణాళికతో క్షేత్ర స్థాయిలో ఈ గ్రామ సమస్యలకు ఏవిధంగా పరిష్కారం చూపాలో ఆర్డీఓ, తహసీల్దార్‌ను ఆదేశించామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపరిహారం కూడా పొందలేకపోయారని, ధాన్య సేకరణకు అవకాశం ఉన్నా కూడా సంబంధిత వ్యవసాయ అధికారుల అవగాహనా లోపం వల్ల ఈ ప్రక్రియ జరగలేదని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు మధుసూదన్‌రావు, సర్వేయర్ హరినాథ్ , రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ లారీ ఢీకొని మహిళ మృతి



రజనమ్మ మృతదేహం

బుచ్చినాయుడుకండ్రిగ: ద్విచక్ర వాహనాన్ని వెనుకవైపు నుంచి కంటైనర్ లారీ ఢీకొనడంతో మహిళ మృతి చెందగా, ఇద్దరు వ్యక్తులకు గాయాలైన ఘటన వెస్టువరత్తూరు గ్రామం వద్ద కేటీరోడ్డుపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. శ్రీకాళహస్తి మండలం, రామాపురం గ్రామ ఎస్టీ కాలానికి చెందిన రజనమ్మ(30), భర్త రమణయ్య, మామ సుబ్బరామయ్యతో కలసి పెద్దపాందూరు గ్రామంలోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. మార్గమధ్యంలోని వెస్టు వరత్తూరు గ్రామం వద్ద ద్విచక్ర వాహనాన్ని తిరుపతి నుంచి చెన్నైకి వెళ్తున్న కంటైనర్ లారీ వేగంగా ఢీ కొంది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న రజనమ్మకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రమణయ్య, సుబ్బరామయ్యకు గాయాలయ్యాయి. రమణయ్య, సుబ్బరామయ్యను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తికి 108 అంబులెన్స్‌లో తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు.

జీవవైవిధ్య సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో శేషాచలం-జీవవైవిధ్యం అనే అంశంపై ఎస్ఎస్ఎస్, అక్షర ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17న సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు గురువారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీన్ నరసింహ, అక్షర ఫౌండేషన్ అధినేత మద్దినేని హరిబాబు, ఎస్వీయూ కో-ఆర్డినేటర్లు డాక్టర్ పాకనాటి హరికృష్ణ, డాక్టర్ పత్తిపాటి వివేక్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమలలో హీరో కిరణ్ అబ్బవరం

తిరుమల: తిరుమల శ్రీవారిని హీరో కిరణ్ అబ్బవరం గురువారం ఉదయం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం



సుప్రీంకోర్టు న్యాయమూర్తి డాక్టర్ ఎస్వీఎన్ భట్టి

తిరుపతి తుడా: మహిళా సాధికారతను సాధించడానికి, స్వీయ రక్షణ కోసం రాజ్యాంగం అనే చట్టాల ద్వారా హక్కులను కల్పించిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి డాక్టర్ ఎస్వీఎన్ భట్టి పేర్కొన్నారు. స్విమ్స్ పద్మావతి ఆడిటోరియంలో గురువారం చట్టం, మహిళా సాధికారత అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలన్నారు. భారత రాజ్యాంగం మహిళలకు సమానత్వాన్ని ప్రసాధించిందన్నారు. సాధికారత అంటే ఎగుమతి, దిగుమతి చేసుకునే సరుకు కాదని గుర్తుచేశారు. మహిళలు తమకు తాముగా సాధికారతను సాధించుకోగలరి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సాధికారిత, లింగ సమానత్వంపై అడిగిన ప్రశ్నలను ఆయన నివృత్తి చేశారు. డాక్టర్ ఆర్వీ కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన విరించి



ముగింపు కార్యక్రమానిక హాజరైన అతిథులు



పోటీలలో పాల్గొన్న విద్యార్థిని

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఇందిరా ప్రియదర్శిని వేదికగా గత రెండు రోజుల పాటు సాగిన విరించి-2025 టెక్‌ఫెస్ట్ గురువారం ముగిసింది. స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. సంప్రదాయం, సాంస్కృతికం ప్రతిబింబించేలా వేడుకలు సాగాయి. విద్యార్థినులు ఆటపాటలతో అదరగొట్టారు. ముగింపు కార్యక్రమానికి వేదిక్ వర్సిటీ వీసీ సదాశివమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. రెండవ రోజు విద్యార్థుల సృజనాత్మక శక్తికి పదును పెట్టే పోటీలను నిర్వహించారు. అనంతరం ముఖ్యఅతిథి చేతుల మీదుకు ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులందించారు. వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజిని, డైరెక్టర్ మల్లికార్జున, అధ్యాపకులు, సుమారు 900మంది విద్యార్థులు పాల్గొన్నారు.